ప్రజాశక్తి

ఆదివారం 13 డిసెంబర్ 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-నెల్లూరు :

ఈ నెల 18న మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో కార్పొరేటర్లను ఆయా పార్టీలు కాపాడుకొనే దిశగా వ్యూహరచనలు చేస్తున్నాయి. ఈ క్రమంలో 42వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ షేక్ కరీముల్లా విజయవాడలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ సమక్షంలో టిడిపి కండువాను కప్పుకున్నారు. 37వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ కూడా మంత్రి నారాయణ సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపికి బలమైన నాయకులుగా ఉన్న బొబ్బల శ్రీనివాసయాదవ్, కరీముల్లాలు ఇద్దరూ ఆ పార్టీని వీడి టిడిపిలో చేరడంతో వైసిపి కూటమిలో నైరాశ్యం నెలకొంది.మరి కొంత మంది వైసిపిని వీడి టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ఈ ఇద్దరు వైసిపిని వీడి టిడిపిలో చేరడంతో కార్పొరేషన్‌లో టిడిపి సంఖ్యా బలం 41కి చేరింది. వైసిపి 11కు పడిపోయింది.

మంత్రి నారాయణ సమక్షంలో టిడిపిలో చేరిన 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా

సవరించిన అంచనాలతో

జెడ్‌పి వార్షిక బడ్జెట్ ఆమోదం

చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వెల్లడి

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు

జెడ్‌పి వార్షిక బడ్జెట్ (2026-2027) అంచనాలకు 2025-2026 సవరించిన బడ్జెట్ అంచనాలకు సభ్యులు ఏకగ్రీవంగా సమ్మతి తెలపడంతో ఆమోదించినట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్‌పి సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, సిఇఒ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సమావేశంలో కావలి, సూళ్లూరుపేట ఎంఎల్‌ఎలు డివి కృష్ణారెడ్డి, నెలవల విజయశ్రీ జడ్పీటీసీలు, ఎంపిపిలు, అధికారులు హాజరయ్యారు. జడ్‌పి ఆదాయ, వ్యయాలను పద్దులవారీగా కలుపుకుని 2026-27 సంవత్సరపు బడ్జెట్ అంచనాలతో రూ.61,07, 26,000.00లు ఆదాయంగా తీసుకుని, వ్యయముగా రూ.61,06,73,896.00లు చూపించి బడ్జెట్ అంచనాలు రూపొందించారు. రూ.52, 104.00 మిగులు బడ్జెట్ అంచనాలను తయారు చేశారు. వీటికి సభ్యులు ఆమోదం తెలిపారు. 2025-26 సంవత్సరంలో సవ రించిన అంచనాలలో రూ. 76,45, 62,703.00లు ఆదా యంగా రూ.71,98,30, 376. 00లు వ్యయంగా చూపిం చారు. వీటికి సభ్యులు ఆమోదం తెలివి నట్లుగా జడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ తెలిపారు.

సమస్యలపై చర్చ

తొలుత సమావేశంలో వ్యవసాయం, జలవనరులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, అర్‌అండ్‌బి శాఖలవారీగా సభలో చర్చించారు. ప్రధా నంగా యూరియా సరఫరాను మెరుగుపరచాలని సభ్యులు కోరగా, రైతుల అవసరాల మేరకు ఈ ఏడాది యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎటువంటి ఇబ్బం దులు లేవని, అడిగిన వెంటనే యూరియాను సరఫరా చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి సభ్యులకు వివరించారు. నందవరం-నంది పాడు, మర్రిపాడు-గౌరవరం, కలువాయి మండలంలో రహదారులు, పలు ప్రధాన రహదారుల మరమ్మత్తులు, నూతన రోడ్ల మంజూరుపై సభ్యులు ప్రశ్నించారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యకేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. జడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను ఆయాశాఖాల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల మరణించిన దక్కిలి జెడ్‌పిటిసి కలివెల రాజేశ్వరమ్మ మృతికి సంతాపం ప్రకటించారు.

ఆ మూడు నెల్లూరులోనే కొనసాగించాలి

కలువాయి, రాపూరు, సైదాపురం మూడు మండలాలను జిల్లాలోనే కొనసాగించేలా సభ్యులు ప్రధానంగా చర్చించారు. తిరుపతిజిల్లాలో కలపడం వల్ల ఎదురయ్యే సమస్యలను సభ ద ష్టికి తీసుకొచ్చారు. జిల్లాలోనే కొనసాగించే సభ్యుల ప్రతిపాదనలను ప్రభుత్వం ద ష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేయగా, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

విజయదీపిక స్టడీ మెటిరియల్‌ను జెడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. జిల్లాలోని 418 జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 20500మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నారు. డిప్యూటీ సిఇవో మోహన్ రావు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, జలవనరులశాఖ ఎస్‌ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, టిజిపి ఎస్‌ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్‌ఈ ప్రసాదరావు, డిఎంహెచ్‌ఓ డాక్టరు వి.సుజాత, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న అరుణమ్మ, తదితరులు

నోటీసులు అందజేయడం దారుణం : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా ప్రస్తుతం ఇంటి పన్ను , కొళయి పన్నుకు సంబంధించి రూ. వేలల్లో బకాయిలు ఉన్నాయని, చెల్లించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుం టామంటూ ప్రజలకు నోటీసులు అందజేయడం ఏమిటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ జరిగింది. ఈ కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జడ్జిని కలిసి కార్పొరేషన్ పరిధిలో పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇంటి పన్ను, కుళాయి పన్ను బకాయిలు న్నాయని, తక్షణమే చెల్లించాలని లీగల్ సెల్ నుంచి నోటీసులు అందజేశారన్నారు. దీన్ని పరిశీలించి పేదలకు ఉపశమనం కల్పించేలా న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ శాఖ, మేరకు ఏడాదిలో రెండు సార్లు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రజలకు ఇంటిపన్ను, కుళాయి పన్ను చెల్లించాలని నోటీసులు అందజేయాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచి లీగల్ సెల్ అథారిటీ నుంచి నోటీసులు అందజేశారన్నారు. ఇది నిరుపేద కుటుంబాలపై భారం మోపడమేనన్నారు. నగర పాలక సంస్థ అధికారులు 1956 మంది ఇంటి పన్ను బకాయి ఉందని, అదే విధంగా 5996 మంది కుళాయి పన్ను బకాయి ఉన్నారని, ఇంటి పన్ను, కుళాయి పన్నులకు సంబంధంచి మొత్తం రూ. 25 కోట్ల మేరకు నగర పాలక సంస్థకు చెల్లించకుండా బకాయి ఉన్నందున తక్షణమే చెల్లించాలంటూ కోర్టు నుంచి నోటీసులు అందజేయడం దారుణమన్నారు. బకాయిలు చెల్లించకపోతే జైలు శిక్ష విధించాల్సి వస్తుందని భాయందోళనలకు గురి చేయడం సరికాదన్నారు.. పజల నుంచి పన్నుల రూపంలో వసూళ్లు చేస్తున్న కార్పోరేషన్ అధికారులు ప్రజలకు ఏ మాత్రం మౌలిక వసతులు కల్పిస్తున్నారని, కార్పోరేషన్ పరిధిలో ఎన్ని డివిజన్లలో డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా ఉందని, వీధి లైట్లు , రహదారులు సక్రమంగా ఉన్నాయా అని ప్రశ్నించారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు పునరాలోచించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు కె.పెంచలనర్సయ్య, పి. సూర్య నారాయణ, అజీజ్ బాయ్, ఎన్.మాలకొండయ్య, మహిళా నాయకురాలు కత్తి పద్మా, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు

14,15 తేదీల్లో

మంత్రి 'ఆనం' పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.13న సాయంత్ర 4.00 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి రాత్రి 8.00 గంటలకు నగరానికి చేరుకుంటారన్నారు.14-12-2025 ఉదయం 9.30 గంటలకు సంగం మండలంలోని మక్తాపురం చేరుకుంటారన్నారు. అక్కడ రూ. 66.00 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించి, రూ. 32.00 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతి భవనానికి శంకుస్థాపన చేస్తారాన్నరు. మధ్యాహ్నం 3.00 గంటలకు జరిగే రైతన్న - మీకోసం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం నగరానికి చేరుకుంటారన్నారు. 15 ఉదయం ఉదయం 10.00 గంటలకు స్వర్గీయ భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 100వ జయంతి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మేయర్ రాజీనామా ప్రకటన

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగర మేయర్ పి. స్రవంతి జయవర్ధన్ రాజీనామా ప్రకటించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని త ఛాంబర్‌లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. తనపై అవిశ్వాస తీర్మానానికి పట్టుబడుతూ రాజకీయ కుట్రలు పన్నడంపై తనను కలిచివేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఒక గిరిజన మహిళను పదవి నుంచి దించేందుకు కుట్రలు పన్నడం ప్రజలందరూ గమనిం చారన్నారు. తాను అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. తనపై అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకునేందుకు తనకు మద్దతు ఇస్తున్న కార్పొరేటర్లను బెదిరించారని, ప్రలోభాలకు గురి చేశారని వాపోయారు. తన రాజీనామా పై కలెక్టర్ ను కలుస్తానన్నారు. తాను మేయర్ పదవికే దూరం అవుతున్నాని, ప్రజలకు మాత్రం కాదని ఆమె తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన గిరిజన ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం నేతలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

మేయర్ పి స్రవంతి జయవర్ధన్ నెల్లూరు మేయర్

జ్యోతి ప్రజల్వన చేస్తున్న దృశ్యం

అట్టహాసంగా 'స్పోర్ట్స్ మీట్'

ప్రజాశక్తి-నెల్లూరు

పిల్లల్లో ఆటలు చైతన్యాన్ని, మానసిక స్థైర్యాన్ని నింపుతాయని,తద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఆర్.బాలాజీ రావు పేర్కొన్నారు. శనివారం విద్యాశాఖ , సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పారా స్పోర్ట్స్ మీట్ పోటీలు ఘనంగా ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని డిఇఒ ఆర్ బాలాజీ రావు , సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ డి. వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పారా ఒలంపిక్స్ తరహా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేశారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సాధారణ విద్యార్థుల వలె క్రీడల్లో ప్రతిభ కనపరుస్తున్నారన్నారు. 2025 బ్లైండ్ క్రికెట్ బాలికల విభాగంలో భారతదేశం వరల్డ్ కప్ సాధించిందని గుర్తు చేశారు.స్పోర్ట్స్ కోటాలో నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని నాయకత్వ లక్షణాలను పెంపొంది స్తాయని విద్యార్థుల సమగ్ర అభివ ద్ధికి దోహదపడతాయని తెలిపారు. డిఎస్డివో పాండురంగరాజు, జిల్లాపారా స్పోర్ట్స్ కమిటీ అధ్యక్షులు టీ సీ మాల్యాద్రి నాయుడు మాట్లాడారు.. జిల్లా నలుమూలల నుంచి 120 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభను కనపరిచిన క్రీడాకారుడలందరికి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి. వెంకట సుబ్బయ్య పథకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపించినటువంటి సహిత కోఆర్డినేటర్ ప్రసాద్ రావు కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆదినారాయణరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-కందుకూరు :

మండలంలోని మాచవరంలో శనివారం స్వర్గీయ ఆదినారాయణ రెడ్డి 37వ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదినారాయన రెడ్డి తనయుడు మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి మాట్లాడారు. ఆదినారాయణ రెడ్డి విలువలకు నిలువెత్తు నిదర్శమన్నారు. ఈ నాటికి ప్రజల హృదయాలలో నిలిచి ఉన్నారంటే అయన ప్రజలకు చేసిన మంచేనని తెలిపారు. తొలుత మాచవరంలోని ఆదినారాయణ రెడ్డి విగ్రహానికి అయన కుమారులు మానుగుంట మహీధర్ రెడ్డి, మానుగుంట ప్రభాకర్‌రెడ్డి తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మానుగుంట అభిమానులు తరలివచ్చి ఆది నారాయణ రెడ్డికి నివాళు లర్పించారు. తన తండ్రికి నివాళి అర్పించడానికి వచ్చిన అభిమానులకి మహీధర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నియోజ కవర్గంలోని పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదినారాయణరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న 'మానుగుంట'

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి -తోటపల్లి గూడూరు

మండలంలోని కొవెరపాలెం, గ్రామల్లోని దిత్వా తుపాన్ బాధిత రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సబ్సిడీపై విత్తనాలు అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ ఇంగిలేల వెంకట చైతన్యకుమార్, తెలుగు యువత మండల అధ్యక్షులు జి సుధీర్ మాట్లాడారు. కూటమిప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తుందని తెలిపారు. సుమారు 290 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వీటిని పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనాటి విజయ్‌కుమార్, పరంధామయ, తలమంచి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు..సవాళ్లు..!

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరంలో అల్లరి మూకలు రెచ్చిపోతూనే ఉన్నారు.గంజాయి మూకల చేతిలో హత్యకు గురైన ప్రజా నాట్యమండలి కళాకారుడు కె. పెంచలయ్య ఉదంతం జరిగిన వారం వ్యవధిలోనే సిటీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై అల్లరి మూకలు రెచ్చి పోయి దాడి చేశారు. సైడ్ ఇవ్వలేదన్న కారణంతో ఐదుగురు మూకలు వారిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. కండక్టర్ కూడా గాయపడ్డాడు. అది జరిగిన మరుసటి రోజే మరో అల్లరి మూక ఓ వ్యక్తిపై దాడి చేశాడు. దీంతో నగరంలో చోటు చేసుకుంటున్న వరుస పరిణామాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. దీంతో ఖాకీలు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి 10 గంటల తర్వాత షాపులు మూసివేయడంతోపాటు కూడళ్ల వద్ద పోలీసులు గస్తీ చేపడు తున్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు వేతనాలు పెంపుదల చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేసిన ఆందోళన అట్టడుకింది. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే స్వాధీనం చేసుకుంటామని అధికారులు హెచ్చరించడంపై సిపిఎం సిపిఎం నగర కమిటీ ఆందోళన చేపట్టింది. ఆర్థిక స్థోమత లేకపోతే ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నిస్తూ పేదలకు బాసటగా నిలిచింది. స్థలాలు మరొకరికి కేటాయిస్తే ఒప్పుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కార్పొరేషన్ అధికారులు ఇంటి పన్ను, కుళాయి పన్ను బకాయిలు భారీ ఉన్నాయని, తక్షణమే చెల్లించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఆ మేరకు జిల్లా కోర్టు ఆవరణంలో జరిగే లోక్ అధాలత్‌లో పాల్గొని బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో చర్యలు తీసు కుంటామంటూ లీగల్ సెల్ ద్వారా నోటీసులు అందజే శారు. దీంతో కా ర్పోరేషన్ అధికారులు ఉన్నపళంగా నిరు పేదలకు లీగల్ సెల్ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేయడాన్ని తప్పు పడుతూ సిపిఎం ఆధ్వర్యంలో పేదలు నిరసన చేపట్టారు. లోక్ అదాలత్ కార్యక్రమానికి హజరై ప్రజల ఆందోళన తెలియజేశారు. దీనిపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలకు ఇటీవల గంజాయి మాఫియా చేతిలో దారుణంగా హత్యకు గురైన ప్రజానాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య స్మారక జ్యోతిని నగరం నుంచి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తీసుకెళ్లారు. అక్కడ జరుగుతున్న మహాసభల్లో పెంచలయ మృతికి సంతాప తీర్మానం చేసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మరోవైపు ఈనెల 18న నగర మేయర్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అధికార, విపక్షాల కూటముల్లో అలడజలు నెలకొన్నాయి. తొలుత టిడిపికి చెందిన ఐదుగురు కార్పొరేటర్లను వైసిపి నేతలు ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి కండువాలు కప్పారు. దీంతో అధికార కూటమిలో అప్రమత్తమైంది. వెంటనే రంగంలోకి దిగిన నేతలు అనేక ఒత్తిళ్లతో తమ దారికి తెచ్చుకుంటున్నారు. శనివారం ఇద్దరు వైసిపి కార్పొరేటర్లు మంత్రి నారాయణ సమక్షంలో టిడిపిలో చేరారు. దీంతో వైసిపి శిబిరంలో నైరాశ్యం నెలకొంది. మరో నాలుగు రోజుల్లో మేయర్ ఎన్నిక జరగనుంది. ఇలా మేయర్ ఎన్నికపై జరుగుతున్న రాజకీయ క్రీడ ఎటు దారితీస్తుందో వేచి చూడాలి.

ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-సంగం

మండలంలోని కొరిమెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆత్మకూరు డివిజన్ స్థాయి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఆత్మకూరు డిప్యూటీ డిఇఒ జానకిరామ్ పాల్గొని ప్రారంభించారు. ఉపాధ్యాయుల క్రికెట్, త్రో బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ జానకి రామ్ మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్‌లోని 9 మండలాల నుంచి క్రికెట్ జట్లు పోటీ పడగా.. మహిళా ఉపాధ్యాయినులకు సంబంధించిన త్రోబాల్ క్రీడలో ఆరు జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ పోటీలు దాదాపు రెండు నుంచి మూడు రోజుల పాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రోజువారీ విధుల్లో విద్యార్థులతో నిమగ్నమై ఉంటుంటారు.. ఈ క్రీడా పోటీలు వారి కోసం ఒక ఆటవిడుపుగా, క్రీడా స్ఫూర్తిని పెంచే విధంగా, అలాగే వారి శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఒక అద్భుతమైన అవకాశంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మర్రిపాడు ఎంఇఒ తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ హేయమైన చర్య

ప్రజాశక్తి-బిట్రగుంట : వైసిపి అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేట్ కాలేజీలుగా మార్చడం హేయమైన చర్య అని బోగోలు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. బోగోలు వైసిపి కార్యాలయంలో విలేఖల సమావేశంలో రఘు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేస్తున్నందుకు నిరసనగా వైసిపి ప్రభుత్వం చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయికి చేరిందని, ప్రయివేటీకరణను సిపిఎం, సిపిఐ పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ, కావలి వైసిపి ఇన్‌ఛార్జ్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో జరుగు ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీకి ప్రజాసంఘాలు, విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మేకల శ్రీనివాసులు, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు కళ్యాణ్, ఎంపిటిసిలు ఎకె సుందర్ రాజ్, మైనార్టీ నాయకులు నాయబ్ రసూల్, సీనియర్ నాయకులు పాపయ్య, శీనన్న, వెంకన్న, తుమ్మల రమణయ్య, వరుణ్, కమలాకర్, వేణు, సాల్మన్ రాజ్, ఏసు పాదం, రాజా, కుందుర్తి శ్రీనివాసులు, సుధాకర్, పులి వెంకటేశ్వర్లు, రాఘవులు, ప్రసాద్, పిచ్చయ్య, తోటపల్లి సాగర్, మల్లారెడ్డి, బండ్ల సురేష్ గౌడ్, రాయి వినోద్ యాదవ్, నాయకులు వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

వరిలో ఉల్లికోడు నివారణకు చర్యలు

ప్రజాశక్తి-మర్రిపాడు : నారుమడి పిలక దశలో ఉల్లికోడు పురుగును గమనించినట్లయితే కృషి విజ్ఞానకేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. దోమ జాతికి చెందిన తల్లి పురుగులు లేత ఎరుపు రంగులో ఉంటాయన్నారు. గుడ్డు నుండి వచ్చిన వెంటనే పిల్ల పురుగులు (మాగెట్స్) కాండంలోనికి పోయి అంకురం వద్ద వృద్ది చెందే క్రమంలో అంకురం ఉల్లి కాడలలే లేత ఆకుపచ్చని పొడుగాటి గొట్టంగా మార్పు చెంది బయటకు వస్తున్నాయన్నారు. కంకి వేయదని, దుబ్బులలోని కొన్ని పిలకలు మాత్రమే ఉల్లికాడ వలె గొట్టాలుగా మారుతాయని తెలిపారు. ఉల్లికోడు తట్టుకొని రకాలను సాగు చేసినప్పుడు, రుతుపవనాలు ఆలస్యమై, నాట్లు ఆలస్యమైనప్పుడు, గాలిలో తేమ 82-88 శాతం ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువ అవుతుందన్నారు. నారుమడిలో చదరపు మీటరుకు ఒక ఉల్లికోడు సోకిన పిలక, పిలక దశలో 5 శాతం ఉల్లి గొట్టాలు లేదా దుబ్బుకి ఒక కోడు సోకిన పిలక గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలన్నారు. నారుమడిలో విత్తనం మొలకెత్తిన 10 నుండి 15 రోజుల లోపు ఒక సెంటుకు 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3శాతం సి.జి. గుళికలు పలుచగా నీరుంచి చల్లి ఆ మడిలోనే ఇంకేటట్లు చేయాలని తెలిపారు. నాట్లు ఆలస్యంగా వేసినపుడు, నాటిన 10 నుండి 15 రోజులలో కార్బోఫ్యూరాన్ 3శాతం సి.జి. గుళికలను ఎకరాకు 10 కిలోలు వేయాలన్నారు.

టిడిపి నేతకు ఎంఎల్‌ఎ వీడ్కోలు..

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని మాసాయి పేట గ్రామానికి చెందిన టిడిపి కుటుంబ సభ్యుడు, మంచి మనసున్న మన్నెం వెంగయ్య హఠాన్మరణంపై శాసనసభ్యులు కాకర్ల సురేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎంఎల్ఎ వెంగన్న మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారికి శాంతి చేకూరాలని కోరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమం ఎక్కడ జరిగినా చిరునవ్వుతో ముందుండి పాల్గొంటూ, అందరినీ ఆప్యాయంగా పలకరించే వెంగన్న ఇక మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని, వారి మరణం తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాక, గ్రామ ప్రజలకు కూడా తీరని లోటుని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బయన్న, మైనార్టీ నాయకులు రియాజ్, బొజ్జ నరసింహులు, తుమ్మల కిరణ్, నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

ఆరోగ్య సేవలపై గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు కొనసాగాల్సిన వైద్యసేవలు, పరిమిత కాల వ్యవధిలోని కొనసాగుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా పలువురు గండువారిపల్లి, అనుమసముద్రం గ్రామస్తులు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి సుమారు ఈ హాస్పిటల్‌లో రాత్రి సమయంలో ప్రజలు హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు ఎవరూ లేకపోవడం జరుగుతుందని, పవిత్ర పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసియున్న ఈ ప్రాంతంలో, అరకొర సిబ్బందితో ఈ హాస్పిటల్ లో సేవలందిస్తున్నారని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించి, ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత నెల్లూరు డిఎంహెచ్ఒను ఫోన్‌లో సంప్రదించగా హాస్పిటల్‌లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని, ఇటీవల అనివార్య కారణాల వల్ల, ఇక్కడ పనిచేస్తున్న వారు వేరే చోటికి మార్చడం వల్ల ఈ పరిస్థితి సంభవించిందని, మరికొద్ది రోజుల్లో ఈ సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు.

నేడు ఆత్మకూరుకు మంత్రి ఆనం రాక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు పట్టణానికి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రానున్నారని ఆత్మకూరు మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు ప్రకటన ద్వారా తెలిపారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నూతనంగా ఎంపికైన ఎఎంసి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు,అన్ని సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో వ్యవసాయ, మార్కెటింగ్, సాగునీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమక్షంలో రైతన్నా.. మీకోసం.. ప్రత్యేక సమావేశం నిర్వహింస్తారని తెలియజేశారు.

ఆదరణ కేంద్రంలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : బిఎంఆర్ యువసేన అధ్యక్షుడు షమీవుల్లా పుట్టినరోజు సందర్భంగా భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాథలకు శనివారం పండ్లు, బిస్కెట్లు, రొట్టెలను, స్వీట్లను అందజేశారు. ఈ సందర్భంగా బిఎంఆర్ యువసేన ఉపాధ్యక్షుడు దబ్బేరు శ్రీధర్ రావు మాట్లాడుతు షమీవుల్లా పుట్టిన రోజు ఆదరణ కేంద్రంలోని అనాధలతో కలిసి జరుపుకోవడం ఆయన మంచి మనసుకు నిదర్శనమని, బిఎంఆర్ ట్రస్ట్ సహకారంతో పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమం పాల్గొన్న టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ భాషా, ఆదరణ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి తనయుడు శరత్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు షకీల్, హుసేన్, అంతర్జాతీయ కరాటే బ్లాక్ బెల్ట్ మాస్టర్ రవిగన్, భాస్కర్, రమేష్, బిఎంఆర్ యువసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా నీటిపన్ను వసూళ్లు

ప్రజాశక్తి-కావలి

పేదలపై బలవంతపు నీటి పన్నులను ఆపాలని కోరుతూ చైర్మన్-కం-సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ కావలి వారికి సిపిఎం ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో అర్జీని అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కావలి పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు వేలాది రూపాయలు నీటి పన్నులను వేసి, అవి చెల్లించాలని లేకలను సర్వీస్ చైర్మన్ ద్వారా ప్రజలకు నోటీసులు ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. పట్టణంలో పేదలు గతంలో జాతీయ మహాత్మా గాంధీ అభివృద్ధి పథకం (ఎంఎస్ డిపి) ద్వారా దారిద్ర్య రేఖకు దిగువ బిపిఎల్ ఉన్న పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన మంచినీటి కొళాయి కనెక్షన్లు తీసుకున్న పేదలకు ఇప్పుడు మున్సిపల్ అధికారులు వేలాది రూపాయల నీటి బకాయిలు ఉన్నారని చెల్లించాలని నోటీసులు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. పేదలు వేలాది రూపాయల్లో నీటి పన్నులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని, రోజువారి కూలీ పనులు చేసుకుని తమ కుటుంబాలను పోషించుకునే పేదలకి వేల రూపాయలు నీటి పన్నులు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తే మరిన్ని ఇబ్బందులకు గురై అప్పుల పాలయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంపై పరిశీలించి పేదల నివాసిత ప్రాంతాలలో నీటి పన్నులు రద్దు చేయించాలని, అలాగే బలవంతపు పన్ను వసూళ్లను ఆపు చేయించి పేదలకు న్యాయం చేయాలని ప్రజలకు భయ భ్రాంతులకు గురి చేసే చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వగలరని కోరుతున్నామని మెమోరాండం ద్వారా చైర్మన్-కం-సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీస్ కమిటీకి ఈ మెమోరాండం ద్వారా కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.కృష్ణ మోహన్, బి.కృష్ణయ్య, ప్రజా సంఘాల నాయకులు మధు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రయివేటు వ్యక్తులకు పంచాయతీల ఆస్తి

- సంపద సృష్టి అనడం సిగ్గుచేటని ప్రభుత్వంపై ఏపి రైతుసంఘం మండిపాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పంచాయతీల పరిధిలో ప్రజలకు పశువులకు ఉపయోగపడుతున్న పోరంబోకు భూములను తక్కువ ధరకు అనుకూలమైన వారికి అప్పు ప్రయివేటు వ్యక్తులకు లాభం చేకూర్చి ప్రభుత్వానికి నష్టం చేకూరుస్తూ సంపద సృష్టిస్తున్నామని చెప్పడం అవివేకమని ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్కు కృష్ణ ప్రసాద్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కొండలు మేత పోరంబోకు భూములను సామూహిక అవసరాల కోసం రిజర్వ్ చేసిన ప్రభుత్వ భూములను విక్రయించాలని చూడడం అన్యాయం అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు అన్ని మండలాల తహశీల్దార్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ తీర్మానాల ద్వారా పోరంబోకు భూములను అనాధీన భూములుగా మార్చేందుకు అధికారం ఇవ్వడం అన్యాయమన్నారు. ఎఎస్‌పేట మండలం శ్రీకొలను పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 411లోని 32 ఎకరాల మేత పోరంబోకు భూములను అనాధీన భూములుగా పంచాయతీ అధికారులు తీర్మానం చేసి పంపాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. గ్రామంలోని పేదలకు రైతులకు ఈ భూములు జీవాలు పశువులు మేపుకునే వాటి ద్వారా ఆదాయం పొందుతున్నారని అయితే ప్రధానమంత్రి కుసుమ ప్లాంట్ ఏర్పాటు చేయడం కోసం ఆ స్థలాన్ని సేకరించాలని చెప్పడం అన్యాయమన్నారు. అదేవిధంగా నవంబర్‌లో మర్రిపాడు మండలం కదిరినేనిపల్లి గ్రామంలో గ్రామ ప్రజలకు తెలియకుండా 400 ఎకరాల భూమిని వయోగ్యాప్ ప్లాంట్ నిర్మాణం కోసం కేటాయించగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. బండగానిపల్లి గ్రామంలో విలువైన క్వార్ట్జ్ కొండను ఇండోసోల్ కంపెనీకి ఏడాదికి 99,900 టన్నులు రాయిని తరలించేందుకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో టన్ను పదివేలకు పైగా పలుకుతుండగా ఆ కంపెనీకి 125 ధారదత్తం చేశారన్నారు. ఈ విధంగా లక్షల కోట్ల రూపాయల దోపిడీకి సిద్ధమయ్యారని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. ప్రజలను భాగస్వాములను చేసే ఉత్పత్తిని పెంచి సంపద సృష్టించాలి గానీ ఈ విధంగా భూములు అన్ని ప్రజల పశువుల పొట్ట కొట్టడం సమంజసం కాదని ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలని వారు కోరారు.

ఘనంగా రథయాత్ర

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో ఇస్కాన్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో 10వ శ్రీశ్రీ గౌర నితాయ్ (కృష్ణ - బలరామ్) రథయాత్ర శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా కావలి శాసన సభ్యులు కృష్ణారెడ్డి రథయాత్రకు జెండా ఊపి శుభారంభం చేశారు. కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గీతావాణి

5233 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 5,233 కేసులు పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌కు ముఖ్య అతిథిగా లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతా వాణి హాజరై, కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులు, కుటుంబ వివాద కేసులు, బ్యాంకు బకాయి కేసులు, సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ అదాలత్, మీడియేషన్ ద్వారా చేసుకొంటే ఖర్చు, సమయం, ఆదా అవుతుందని, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు లోక్‌అదాలత్ ద్వార ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే ఈ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్, అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.విక్రమ్‌సిన్హా కలసి సుమారు 5233 సివిల్, క్రిమినల్, చెక్కు బౌన్స్, పిఎల్సి, ఎక్సైజ్ బ్యాంకు కేసులు పరిష్కరించి, అలాగే సుమారు రూ.78,04,,911/- నగదును కూడా పరిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె. చక్రపాణి, ఏ.పి.పి ముదుల, మెంబర్లుగా ఐ.సాయి ప్రసాద్, పి.సునీల్ కుమార్ సింగ్, జయలక్ష్మి, సభ్యులు, న్యాయవాదులు యస్ కెనడి, జగన్ మోహన్ రావు, ఎ. ప్రసాద్ రెడ్డి, కె.శ్రీనివాసుల రెడ్డి, కలీం అహమ్మద్ రోజ్దార్, జి. రాజేంద్ర వర ప్రసాద్ ఎం.బాబురావు,పి. వి. రమణారెడ్డి, బాలాజీ, ప్రసన్నకుమార్, శ్రీదేవి, జ్యోతి, మనోరమ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంఎల్‌ఎ కాకర్ల

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి అభివృద్ధిపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పలు సమస్యలపై శాసనసభ్యులు కాకర్ల సురేష్ చర్చించారు. ఈ సందర్భంగా శనివారం గుంటూరులో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను శాసన సభ్యులు కలిసి నియోజకవర్గం లోని గ్రామీణ అభివృద్ధి గురించి, గృహ నిర్మాణాల కోసం కాలనీల మంజూరు గురించి రోడ్లు, భవనాలు, సెల్‌ఫోన్ టవర్ల అభివృద్ధి అంశాలపై చర్చించి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.

ఆక్రమణలో ఉన్న భూమికి విముక్తి..

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని రాంపల్లి గ్రామంలో గత మూడు సంవత్సరాలుగా ఆక్రమణకు గురైన దళిత మహిళ ఎస్.పద్మావతమ్మ ప్రభుత్వ భూమిని స్థానిక మండల ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ సహకారంతో విముక్తి లభించిందని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు తెలిపారు. ఈ మేరకు న్యాయవాది వెంకట రమణ ఆధ్వర్యంలో జెసిబితో హద్దులు ఏర్పాటు చేసి సదరు పొలాన్ని పద్మావతమ్మకు సాగు అధికారం కల్పించినదుకు కొప్పాల రఘు, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. దళితులు భూమి, ఆస్తులు, విద్య, అధికారాన్ని పొందినప్పుడే వారికి సామాజిక న్యాయం పూర్తిగా లభిస్తుందనే వాస్తవాన్ని ఎవరూ కాదనలేరని, అంటరానితనం, అకృత్యాల ద్వారా వారు అనుభవించిన అన్యాయాలను నిర్మూలించినప్పుడే దళితులకు ఆత్మవిశ్వాసం కలుగుతుందని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు అన్నారు.

ఆక్రమణలో ఉన్న భూమిని చదును చేస్తున్న దృశ్యం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు చెరువు కలుజును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బోగోలు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. బోగోలు మండల వైసిపి కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండదండలతో చెరువు ఆక్రమణదారులు బోగోలు చెరువు కలుజును ధ్వంసం చేశారని ఆరోపించారు. బోగోలు చెరువు కలుజును ధ్వంసం చేసిన వారిపై నీటి సంఘాల వారు కానీ ప్రభుత్వ అధికారులు కానీ ధ్వంసం చేసిన వారిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. నాయకుల స్వార్ధం కోసం బోగోలు మండల రైతులకు అన్యాయం చేస్తారని, బోగోలు కలుజు ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మేకల శ్రీనివాసులు, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు కళ్యాణ్, ఎంపిటిసి ఎకె సుందర్ రాజ్, మైనార్టీ నాయకులు నాయబ్ రసూల్, సీనియర్ నాయకులు పాపయ్య, శీనన్న, వెంకన్న, తుమ్మల రమణయ్య, వరుణ్, కమలాకర్, వేణు, సాల్మన్ రాజ్, ఏసు పాదం, రాజా, కుందుర్తి శ్రీనివాసులు, సుధాకర్, పులి వెంకటేశ్వర్లు, రాఘవులు, ప్రసాద్, పిచ్చయ్య, తోటపల్లి సాగర్, మల్లారెడ్డి, బండ్ల సురేష్ గౌడ్, రాయి వినోద్‌యాదవ్, నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

రూ.40వేలు వితరణ

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో మరణించిన వారి ఖర్మకాండల నిమిత్తం ఒక్కో కుంటుంబానికి రూ.10వేల చొప్పున శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి రూ.40వేల నగదు దాతృత్వం చేశారు. శనివారం 2వ వార్డ్ పరిధిలోని కుందేలు చెంచమ్మ (66), 10వార్డు పరిధిలోని మహబూబ్ జానీ(64), 14వ వార్డు పరిధిలోని మాముడూరు మస్తానయ్య (64), 19వ వార్డ్ పరిధిలోని దొడ్డి ఆదినారాయణ (56) వారు ఇటీవల కాలం చెందడంతో కంచి పరమేశ్వర్ రెడ్డి మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించి వారికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నలుగురికి రూ.40వేలు అందజేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వర రెడ్డి ఆ కుటుంబాలకు తానెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించాడు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇవాళ ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎందరో మాలాంటి పేదవారి ఆకలిని తీరుస్తూ బస్టాండ్, నెల్లూరుపాళెం, హాస్పిటల్ ఎదురుగా మంచినీరు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఎంతోమంది దాహార్తిని తీరుస్తూ ఇవాళ తమ కుటుంబ సభ్యులు మరణిస్తే తమకు రూ.10 వేలు దాతృత్వం చేసిన నిత్యన్నదాత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న కంచి పరమేశ్వర్‌రెడ్డి

ఎకనామిక్ హబ్‌గా 'విశాఖ'

ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు కృషితో ఆంధ్ర రాష్ట్రంలోని విశాఖపట్నం భారతదేశంలోనే అతిపెద్ద పరిశ్రామిక నగరంగా గ్లోబల్ ఎకనామిక హబ్‌గా విశాఖపట్నం కాబోతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం విశాఖలో 49 పారిశ్రామిక ప్రాజెక్టులపై చర్చ జరగడం, మూడు సంవత్సరాల ఐదు లక్షల మంది నిరుద్యోగ యువకులకు ఐటీ ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రికే దక్కిందన్నారు. గత వైసిపి జగన్మోహన్ రెడ్డి అరాచకా పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా వచ్చిన దాఖలాలు లేవన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రానికి పరిశ్రమలు పోలవరం ప్రాజెక్టు అమరావతి రాజధానిగా కాబోతుందన్నారు. రాబో 3 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రం భారతదేశంలోనే అతి గొప్ప రాజధాని పరిశ్రమలు గల రాష్ట్రంగా అభివృద్ధి సాధించబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంధనపొదుపుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల ఐఐసి, ఈఈఈ విభాగంతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని, ఈ కార్యక్రమానికి డైరెక్టర్ డాక్టర్ కె.రాజారెడ్డి, ఐఐసి ఉపాధ్యక్షులు డాక్టర్ పి.బృందావని, ఈఈఈ హెచ్‌ఒడి డాక్టర్ వి.రవీంద్ర రెడ్డి వక్తలుగా పాల్గొన్నారని తెలిపారు. వక్తలు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు శక్తిని ఎలా ఆదా చేయాలో అవగాహన పెంచూతూ ఇంధన ఆదా అలవాట్లు, పద్ధతులపై కూడా వారు తెలిపారు. కార్యక్రమంలో త్రిబుల్ ఈ విభాగ అధ్యాపకులు విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సింహాలకు కుటుంబ నియంత్రణ

ప్రజాశక్తి-కలిగిరి

జిల్లా జాయింట్ డైరెక్టర్ ఏజ్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ సింహాల బెడదను నియంత్రించారు. డాక్ ఫౌండేషన్ సహకారంతో వాటికి కుటుంబ నియంత్రణ చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తెలిపారు. అందులో భాగంగా నాలుగు వీధులలో కుక్కలకు ప్రతివారంలో ఈ కార్యక్రమంలో చేపడతామని అందులో నాలుగు వీధిలో నించుకొని కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేపడుతామన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా కుక్కల రుద్ది తగ్గి గ్రామంలో తలెత్తే కుక్క బెడద పూర్తిగా అరికట్టొచ్చు అని ఆయన తెలిపారు. వీధిలో ఉండేవారు పంచాయతి సిబ్బందికి సహకరించాలన్నారు.

శాంతికుమారి పదవిపై హర్షం

ప్రజాశక్తి-ఉదయగిరి

నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా టిడిపి రాష్ట్ర కార్యదర్శి మేకపాటి శాంతికుమారికి దక్కడంపై ఉదయగిరి డెవలప్మెంట్ ఫోరం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వి.శ్రీరామచంద్ర మూర్తీ, ఎమ్‌డి. ఖాజా ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ పదవి ఒక మహిళను వరించడం ఇదే ప్రథమమని అంతేగాక ఉదయగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తికి దక్కడం ఇది రెండోసారని అంతకుముందు ఉదయగిరికి చెందిన ఎమ్.డి. లియాఖత్ అలీ ఈ పదవి పొందివున్నారని తెలిపారు. ఉదయగిరి మాజీ శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సతీమణిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా శాంతి కుమారి అసెంబ్లీ నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉన్నారని తెలిపారు. జిల్లాలోని మెట్ట ప్రాంతానికి చెందిన మహిళకు తగిన ప్రాధాన్యత లభించడం శుభ పరిణామమన్నారు. విద్యావంతురాలైన ఆమెకు జిల్లా గ్రంథాలయ సంస్థను సమర్థవంతంగా నిర్వహించ గలరని, గత ఆరేళ్లుగా చతికిలపడివున్న జిల్లాలోని గ్రంథాలయాల ను పునరుజ్జీవం కల్పిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని 61 శాఖా గ్రంథాలయాల్లో సగానికిపైగా లైబ్రేరియన్ పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నాయని, భవన వసతి సౌకర్యాలు, కాంపిటేటివ్ పుస్తకాల కొరత తీర్చాలని వారు కోరారు. జిల్లాలోని వందలాది పుస్తక పంపిణీ కేంద్రాలు ఉనికిని కోల్పోతున్నాయన్నారు. గ్రంథాలయాల సెస్ ద్వారా వచ్చే రాబడిని పెంచే మార్గాలు అన్వేషించి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడి సంస్థ ప్రతిష్ఠతను ఇనుమడింప జేయాలన్నారు.

క్రికెట్‌తో పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ కృష్ణారెడ్డి

ఉపాధ్యాయుల ఆటలపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డులోని జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కావలి డివిజన్ ఎపి టీచర్స్ క్రికెట్ అండ్ త్రోబాల్ టోర్నమెంట్‌ను ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్ఎకు ఉపాధ్యాయులు, అధికారులు, క్రీడాకారులు, వార్డు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి, ఘన స్వాగతం పలికారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడి వద్దకు వెళ్లి మాట్లాడి అభినందనలు తెలియజేశారు. క్రీడాకారులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడి ఉత్సాహం నింపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొనడం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, క్రీడాస్ఫూర్తి మరింత పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, విద్యాశాఖ అధికారులు, క్రీడాకారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రటరీగా మావులూరు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

రైతు సమస్యలపై ఎప్పుడూ ముందుండి పోరాడే నాయకుడిగా పేరుగాంచిన మావులూరు శ్రీనివాసులు రెడ్డికి వైసిపి రాష్ట్ర నాయకత్వం గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు, కోవూరు మాజీ మంత్రివర్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రత్యేక సూచనల మేరకు, మావులూరు శ్రీనివాసులు రెడ్డిని రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీగా నియమించారు. ఇందుకూరుపేట మండలంలో వైసిపి బలోపేతానికి, పార్టీ కార్యకర్తల ఐక్యతకు, గ్రామాల్లో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించిన నాయకుడిగా శ్రీనివాసులు రెడ్డి పేరు ప్రస్తావనలోకి వస్తుంది. గ్రామస్థాయి సమస్యల నుంచి రాష్ట్రస్థాయి రైతు విధానాల వరకూ, ఏ అంశం వచ్చినా రైతుల పక్షాన నిలబడి పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తూ ప్రజలకు చేరువైన నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. రైతాంగం విషయంలో నూతన ఆలోచనలతో, సమస్యలను నేరుగా నాయకత్వం ముందుకు తీసుకెళ్లే ధైర్యం, నిజాయితీ, కష్టపడే తత్వం వల్లే ఈ పదవి తనకు దక్కిందని ప్రాంతీయ నాయకులు అభిప్రాయపడ్డారు. కొత్త బాధ్యతల్లో కూడా రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం మరింతగా శ్రమిస్తారని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మావులూరు శ్రీనివాసులు రెడ్డి పదోన్నతితో ఇందుకూరుపేట మండల వైసిపి నేతలలో హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

నల్లపరెడ్డికి మొక్కను అందజేస్తున్న నాయకులు

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

ప్రజాశక్తి-కోవూరు

మద్యం సేవించి వాహనం నడిపే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు చేపడుతోందని ప్రజల ప్రాణాలు కాపాడడం లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న యనమందల వెంకట్రావును పోలీసులు పట్టుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరు పరచగా, కేసును విచారించిన న్యాయమూర్తి రూ.10వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ముత్యాలరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే వాహనదారుడి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు. అందుకే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు.ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడిపితే ఉపేక్షించేది లేదని, చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు స్వఛ్ఛందంగా చట్టాన్ని పాటించి, తమ కుటుంబాల భద్రతతో పాటు సమాజ భద్రతకూ బాధ్యత వహించాలని ఎస్ఐ ముత్యాలరావు విజ్ఞప్తి చేశారు.